క్లుప్తంగా

పేదలకు అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న విజయకుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం బీఎంఆర్ సేన నాయకుడు విజయకుమార్‌రెడ్డి పేదలకు అన్నదానం చేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం


సరుకులు అందజేస్తున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని న్యాయవాది గుమ్మళ్ల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని నగరివీధిలో గల హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. ఆయన మాట్లాడుతూ 135 నెలలుగా పేదలకు సేవ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాషా, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కోళ్లూరు హరినాథ్‌నాయుడు, బాబాఫరీద్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామనగర్‌కాలనీలో ఉన్న భాష్యం హైస్కూల్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. స్కిట్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయశేఖర్‌రెడ్డి, భాష్యం జెడ్‌సీవో బిందుమాధవి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పైపుల చోరీపై ఫిర్యాదు

కోట: పొలాల్లో పైపులు చోరీకి గురయ్యాయని విద్యానగర్‌కు చెందిన రైతు చక్రవర్తి ఆదివారం ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. చెందోడు సమీపంలోని తన పొలంలో మోటార్లు బిగించేందుకు రూ.20వేల విలువైన పైపులు ఉంచగా శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పైపుల చోరీపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

దొరవారిసత్రం:దొరవారిసత్రం వద్ద ఆదివారం బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. అక్రపాకకు చెందిన బాలాజీ బైక్‌లో నాయుడుపేటకు వెళుతుండగా దొరవారి సత్రం వద్ద లారీ ఢీకొంది. గాయపడిన బాలాజీని నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుఅందలేదు.

చోరీపై విచారణ

కోట: కోట బజారువీధిలో ఉన్న ముత్యాలమ్మ జ్యువెలరీ దుకాణంలో శనివారం జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు ఆదివారం తెలిపారు. వెండి వస్తువులు కొనాలి చూపించాలంటూ వచ్చిన మహిళలు కొన్ని వస్తువులను అపహరించారు. ఆలస్యంగా గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా విచారణ జరిపి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తడ: తమిళనాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీఎస్ డీటీ సంధ్య ఆదివారం పట్టుకున్నారు. మాంబట్టు వైపు వెళ్లే రోడ్డులో దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా 59 బస్తాల తమిళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 3,009 కిలోల బియ్యం విలువ రూ.51 వేలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. మీంజూరు, వాటంబేడుకు చెందిన రాజశేఖర్, శంకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని తడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం


వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


నారాయణవనం: కేక్ కట్ చేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

శ్రీకాళహస్తి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించి 13 ఏళ్లు పూర్తయినట్టు తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పేదల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మిద్దెల హరి, బియ్యపు పవిత్రారెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, గోపీగౌడ్, కోళ్లూరు హరినాథ్‌నాయుడు, సురేష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

నారాయణవనం: రాష్ట్రంలో పేదల కష్టాలను గుర్తించి, సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న పార్టీ వైఎస్సార్‌సీపీ అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నారాయణవనం బైపాస్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి, పెట్టుబడులకు చిరునామాగా రాష్ట్రాన్ని మార్చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. విశాఖలో గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేసి లక్షల కోట్ల పెట్టుబడులు, ఐటీ సంబంధిత పరిశ్రలతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సుధాబాబు, పార్టీ నాయకులు ఏకాంబరం, గురుస్వామి, సాయిరవి, రాజారెడ్డి, మర్కండేయరెడ్డి, చిన్నదొరై, సుబ్రమణ్యం, మణిరెడ్డి పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో సత్యవేడులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కె.నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మంజుల, రమేష్, సోమశేఖర్, శ్యాంప్రసాద్ రెడ్డి, గోవిందస్వామి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సత్యవేడులో..

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండల కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాయకులు చిన్నదొరై, రమేష్ రాజు, తొప్పయ్య, పద్మనాభం, మోహన్ మొదలి, మోహన్, చలపతిరాజు, కిరణ్‌కుమార్, బాబురెడ్డి, మహేష్ రెడ్డి, సురేష్, ఆనంద్, దేశన్, పయణి, చంద్రన్, దేశప్పన్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ మండల కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, నాయకులు జొన్నలగోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, గురవయ్య, కోటేశ్వరరావు, మునిరాజా పాల్గొన్నారు.


పిచ్చాటూరులో..


నాగలాపురంలో..


బుచ్చినాయుడుకండ్రిగలో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్‌కు సంబంధించి ఆరు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 239, 239ఏ, 239 బీ బూత్‌లు, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 240, 240ఏ బూత్‌లు, సరస్వతీబాయి ఉన్నత పాఠశాలలో ఒక బూత్‌ను ఏర్పాటు చేశారు. స్కిట్ కళాశాల ఆవరణలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ బూత్‌లను శనివారం రాత్రి కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. ఆదివారం ఉదయం డీఎస్పీ విశ్వనాథ్, రెవెన్యూ, పోలింగ్ అధ/ కారులు అన్ని బూత్‌లను పరిశీలించి భద్రతా పరమైన చర్యలను, మౌలిక వసతులను పరిశీలించారు. నియోజక వర్గంలో 11,020 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 6,752 మంది, మహిళా ఓటర్లు 4,266 మంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ సుబ్బన్న తెలిపారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఆదివారం బీఎన్‌కండ్రిగ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఏవైన సమస్యలు ఎదురైతే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దారు శివయ్య తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 243వ పోలింగ్ బూత్‌లో పట్టభద్రుల ఓటర్లు 976 మంది, 123వ పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయ ఓటర్లు 34 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

ఏర్పాట్లు పూర్తి

పిచ్చాటూరు: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ మధుసూధన్ రావు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 703, ఉపాధ్యాయ ఓటర్లు 18 మంది ఉన్నారన్నారు. ఓటు వేయడానికి వచ్చే వారు ఓటర్ స్లిప్‌తో పాటు ఓటర్ కార్డు, ఆధార్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో రావాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ వెంకటరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

వరదయ్యపాళెం: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండల కేంద్రాల్లో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 257 మంది, పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 7650 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఏర్పేడు: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుంది. ఈ క్రమంలో ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేసినట్టు తహసీల్దారు ఉదయ్‌సంతోష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల కోసం ఒకటి, పట్టభద్రుల కోసం రెండు బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టభద్రుల కోసం మొదటి బూత్‌లో 978 మంది ఓటర్లు, రెండో బూత్‌లో 607 మంది, టీచర్స్ కోసం మూడో బూత్‌లో 58 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం బారికేడ్లు, తాగునీరు తదితర వసతులు కల్పించామని, 15 మంది ఉద్యోగులు, సీఐ, ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, 20 మంది పోలీసులను నియమించినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓటర్లు ప్రశాంత వాతారణంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు.


బ్యాలెట్ బాక్సులు


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ నాగసుబ్బన్న


బీఎన్‌కండ్రిగలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్న సిబ్బంది


పిచ్చాటూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్


ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బారికేడ్లు


ఓటర్ల జాబితా తదితర ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ అధికారులు

ముక్కంటి సేవలో మాధవానంద సరస్వతి పీఠాధిపతి


ఆలయ ధ్వజస్తంభం వద్ద మాధవానందసరస్వతి స్వామి

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా) : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం తెలంగాణ రాష్ట్రం మెదకల్ జిల్లా మదనానంద సరస్వతి పీఠం పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం


తల్లి సుజాత పాదాలకు నమస్కరిస్తున్న కీర్తన

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాసాగార్డెన్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తమ తల్లులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ తల్లి గొప్పతనం తెలిపేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో పదవ తరగతి ఇన్‌చార్జి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


రాజపాండ్యన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: పట్టణ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ రాజపాండ్యన్ మృతి చెందారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం రేణిగుంటకు చేరుకుని రాజపాండ్యన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేశం, మాజీ ఎంపీటీసీ అన్బుయాదవ్, అంబి యాదవ్, ఖదీర్ ఉన్నారు.

కండలేరులో 43.086 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 43.086 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 910 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 50, హైలెవల్ స్లూయిజ్‌కు 140 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా షిరిడీ సాయి మందిరం వార్షికోత్సవం



కోట: విద్యానగర్ షిరిడీ సాయిబాబా మందిరం 42వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు సామూహిక సాయిలీలామృత పారాయణం చేశారు. వార్షికోత్సవంలో పాల్గొనేందుకు దూరప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. సాయికల్చరల్ మిషన్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జోరుగా వరికోతలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని 27 పంచాయతీల్లో వరికోత పనులు జోరుగా సాగుతున్నాయి. చియ్యవరం, చేమూరు, కాసారం, గద్దగుంట, గుండేలుగుంట, ఇరూపాక్షిపురం తదితర గ్రామాల్లో రైతులు వరి పంటను కోశారు. ఈ నెల 16 నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలపడంతో వరికోతలు కోయాల్సిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట దెబ్బతింటుందని వాపోతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 10 వేల ఎకరాలలో వరికోత పనులు పూర్తి కాగా, ఇంకా 2 వేల ఎకరాల వరకు కోయాల్సి ఉంది. చిట్టత్తూరు, బోనుపల్లి తదితర గ్రామాల్లో వరిపంట ఆలస్యంగా సాగు చేశారు. ఈ క్రమంలో కోతలు కోయడానికి ఇంకా 20 రోజులు ఉండాలని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ధాన్యానికి గిట్టుబాటు ధర రూ.1750 వరకు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

